జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆమనగల్లు, మే 25 : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో కసిరెడ్డి నారాయణరెడ్డిని, శ్రీనివాస్ రెడ్డిని వేర్వేరుగా కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన షేక్ హమీద్‌ను వారు సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు షేక్ హమీద్, ప్రధాన కార్యదర్శి నరేశ్, కోశాధికారి అజీమ్, సభ్యులు రవి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ తదితరులు

కడ్తాల్, మే 25 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మండల కేంద్రంతో పాటు కర్కుల్‌పహాడ్, ముద్విన్ గ్రామాల్లోని వ్యవసాయ భూములు ధరణి నిషేధిత జాబితాలో పడడంతో, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం మండలానికి చెందిన పలువురు నాయకులతో కలిసి, కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మికి ఆయన వినతిపత్రం అందజేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ఆమెకి జడ్పీటీసీ విన్నవించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

షాబాద్, మే 25 : జిల్లాలో ఇంటర్ సపిమెంటరీ పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా జరిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శనివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,707 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8,873 మంది హాజరయ్యారు. 834 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో

కడ్తాల్, మే 25 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంతోపాటు ముద్విన్ గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. వానకాలం సాగు కోసం అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. షాపుల ఎదుట ధరల పట్టికకి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ రాజారత్నం

యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సందీప్‌కుమార్

మొయినాబాద్‌లోని ఎన్కేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారిణి రాగమ్మ

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి

- నకిలీ విత్తనాలను కొనుగోలు చేయొద్దు
- వ్యవసాయ అధికారులు
- పలు మండలాల్లో అవగాహన సదస్సులు

చేవెళ్లరూరల్ : ఇబ్రహీంపల్లిలో బ్యానర్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చేవెళ్ల రూరల్, మే 25 : విత్తనాల కొనుగోలులో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ రమాదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి, దేవుని ఎర్రవల్లి గ్రామాల్లో నకిలీ విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారిణి తులసి హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లూజుగా సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమేశ్, రెండు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు

గుర్తింపు పొందిన డీలర్ల వద్దే కొనాలి

-వ్యవసాయశాఖ ఏడీఏ రాజారత్నం

షాద్‌నగర్‌టౌన్ : వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం అన్నారు. షాద్‌నగర్ మార్కెట్‌యార్డులో శనివారం రైతులకు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి అవగాహన కల్పించారు. విత్తనాల కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

షాద్‌నగర్‌రూరల్ : నకిలి విత్తనాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ రైతులకు సచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ, అలిసాబ్‌గూడ, దొంతికుంట తండాల్లో శనివారం మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ప్రధానంగా విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ వివిధ గ్రామాల్లో ఈ అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

యాచారం : విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ అన్నారు. మండలంలోని గున్‌గల్, కుర్మిద్ద గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులు శనివారం నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విత్తన విక్రయదారుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు ఉన్నారు.

నందిగామ : మండల పరిధిలోని ఈదులపల్లి, మోత్కులగూడ గ్రామాల్లో నకిలీ విత్తనాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈవో వెంకటేశ్ రైతులకు అవగాహన కల్పించారు. అలాగే నర్సప్పగూడ, తల్లగూడ గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. విత్తన కొనుగోలు నుంచి పంటలు పండి ధాన్యం చేతికొచ్చే వరకు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరి

కొత్తూరు : విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని కొత్తూరు మండల వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని పెంటర్లలో విత్తనాల కొనుగోలుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో దీపిక, రైతులు పాల్గొన్నారు.

లూజు సంచుల్లోని విత్తనాలు కొనొద్దు

మొయినాబాద్ : లూజు సంచుల్లో ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదని మండల వ్యవసాయ అధికారి ఎన్ రాగమ్మ అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి, నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో విత్తనాలు కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 31వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి కుమార్, సునీల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు.

కొత్తూరు : పెంజర్లలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో గోపాల్

నందిగామ: నర్సప్పగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వ్యక్తి అదృశ్యం

నర్సింహులు(ఫైల్)

షాబాద్, మే 25: ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్న కుమారుడిని చూసేందుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన షాబాద్ మండల పరిధిలోని నాగరకుంటలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. నాగరకుంటకు చెందిన పానుగంటి నర్సింహులు ఈ నెల 14న ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్న తన కుమారుడిని చూసేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు దవాఖాన పరిసరాలు, బంధువులు, తెలిసిన వారి వద్ద ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. నర్సింహులు ఇంటి నుంచి వెళ్లినప్పుడు పంచ కట్టు, తెల్లని షర్టు ధరించి ఉన్నాడని, తెలుగు మాత్రం మాట్లాడగలడని తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 8297522514కు సమాచారం అందించాలని కోరారు.

మైనర్లకు వాహనాలొద్దు

చేవెళ్లటౌన్, మే 25 : మైనర్లు వాహనాలు నడిపితే జైలుకే వెళ్తారని ట్రాఫిక్ ఎస్సై విఠల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు తల్లిదండ్రులకు కూడా కఠినమైన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, వారితో పాటు ఇతరుల ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. ఈ విషయమై అవగాహన కల్పించినా వారిలో మార్పు రావడం లేదన్నారు. 18 ఏండ్లు నిండి, లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలను నడుపాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

యాచారం, మే 25: మండల కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాకు ఆదివారం 11కేవీ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియాకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 11కేవీ ఫీడర్ సబ్‌స్టేషన్ నిలిపివేయనున్నట్లు తెలిపారు

తుర్కయంజాల్ : తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి రంగనాయకుల గుట్ట ఫీడర్ పరిధిలోని మైత్రీవనం, బ్రహ్మణపల్లి, బ్రహ్మణపల్లి ఏజీఎల్, కొహెడ, తొర్రూర్‌లో సోమవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు సాధారణ మరమ్మతులు, చెట్ల నరికివేతలో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇంజాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రాములు తెలిపారు.

అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య

షాబాద్, మే 25: పాఠశాలల్లో అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా మండలంలో 18 గ్రామాలకు సంబంధించి పాఠశాలల్లో మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి నల్లాల ఏర్పాటు కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త వేధింపులకు భార్య ఆత్మహత్య

పెద్దఅంబర్‌పేట, మే 25: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన నార్ల కొండ మహేందర్, పారిజాత (32)కు పద్నాలుగేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహమైన రెండేండ్ల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మహేందర్ రోజూ తాగొచ్చి పారిజాతను కొట్టడం, వేధించే వాడు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పలుసార్లు పంచాయితీ పెట్టినా మహేందర్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ప్రతి చిన్న విషయానికీ కొడుతూ.. బంధువుల ఇంటికి సైతం వెళ్లనిచ్చేవాడు కాదు. పది రోజుల క్రితం మహేందర్ వేధించగా.. పెద్దలు మరోసారి సర్దిచెప్పారు. శుక్రవారం రాత్రి పారిజాత పురుగు మందు తాగగా మహేందర్ సోదరుడు వనస్థలిపురంలోని ఏరియా దవాఖానకు తరలించారు. వెంటనే పారిజాత కుటుంబసభ్యులు తరలి వెళ్లగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వేధింపులతోనే పారిజాత ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలీలకు పని కల్పించాలి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం, మే 25 : జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను కల్పించాలని ఎంపీపీ కొప్పు సుకన్య భాష అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేందర్‌రెడ్డితో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పనులను మండలంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కూలీలకు కనీస వసతులు కల్పించాలని కోరారు. వారికి ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు కృషి చేయాలని సూచించారు. కూలీలు, పనుల విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించరాదన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో లింగయ్య, సిబ్బంది, కూలీలు ఉన్నారు.

విద్యార్థులకు సకాలంలో దుస్తుల పంపిణీ

మహిళా సంఘాలకు మహిళా మ్యాక్స్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మండల ఏపీఎం కవిత

కందుకూరు, మే 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను మహిళా సమైక్య ఆధ్వర్యంలో తయారు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూనిఫాంల తయారు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు దుస్తులు తయారు చేసి అప్పగించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండల ఏపీఎం కవితతో కలిసి మహిళా మ్యాక్స్‌లో మహిళా కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం కల్పించిన అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాలకు డ్రస్సుల తయారీని అప్పగించినట్లు పేర్కొన్నారు. మండలంలో తిమ్మాపూరు, లేమూరు, కందుకూరు, పులిమామిడి నాలుగు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి క్లస్టర్‌కు 15నుంచి 20మంది మహిళా శక్తి కుట్టుమిషన్ కేంద్రానికి మహిళలకు డ్రస్సులను తయారు చేయాల్సి ఉంటుందని ఏపీఎం కవిత పేర్కొన్నారు. మండలంలోని 53 స్కూళ్లకు 11,378 యూనిఫాంలను తయారు చేయాల్సి ఉంటుందని వివరించారు. దీనికి సంబంధించిన బట్ట టెస్కో నుంచి ప్రభుత్వం సరఫరా చేసినట్లు వివరించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల బట్టలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల లీడర్లు మహిళలు, పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు

హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ

- మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల, మే 25 : పరిశుభ్రత పాటించని హోటల్ యాజమానులపై చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కృతుంగ, మన రుచులు, హర్షిత గ్రాండ్ తదితర హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో ఉన్న ఫుడ్‌తో పాటు పరిశుభ్రతపై ఆరా తీశారు. పరిశుభ్రతను పాటించని హోటల్ యజమానులను హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని, హోటళ్లను సీజ్ చేయాల్సి వస్తుందని మందలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. హోటళ్లలో అపరిశుభ్రత ఉన్నా, నాణ్యత లేకపోయినా అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాంటి హోటళ్లను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సురేశ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

యాచారం, మే 25 : తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మేడిపల్లికి చెందిన జక్కర్త శివకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న అర తులం బంగారం, 25తులాల వెండి, రూ.10వేల నగదును అపహరించుకుపోయారు. శనివారం ఇంటికొచ్చిన శివకుమార్ తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

యాచారం, మే 25: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి తూర్పు రీజియన్ పరిధితో నాన్‌సీవోఈ శంషాబాద్ కళాశాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, వొకేషనల్ (వృత్తివిద్యా) కోర్సుల్లో ప్రవేశం పొందడానికి ఆయా ఖాళీలను బట్టి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పదో తరగతి పాసై ఆసక్తి ఉన్న విద్యార్థులు tgswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పదో తరగతిలో మార్కుల మెరిట్ ఆధారంగా ఆయా గ్రూపుల్లో ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 7702256705 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తిమ్మారెడ్డిగూడలో జీవాలకు టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, మే 25 : జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ, రుద్రారం గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాడి పరిశ్రమను పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం ఉంటుందని చెప్పారు. గొర్రెలు, మేకల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు, పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీను, కృష్ణయ్య, సాగర్, బలరాం, రైతులు తదితరులున్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తాం

వీధి దీపాలు అందజేస్తున్న దాత

ఇబ్రహీంపట్నంరూరల్, మే 25 : దండుమైలారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తామని మాజీ సర్పంచ్, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రవణమోని మల్లీశ్వరీ జంగయ్య అన్నారు. రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రతి స్తంభానికీ వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు రూ.50వేల విలువైన విద్యుత్ దీపాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.